# నేడే భోగి



సంక్రాంతి ప్రత్యేకం..



- సంక్రాంతికి ఒక రోజు ముందు భోగితో సంబరాలు మొదలవుతాయి..
- భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజు అని అర్థం..
- పాడి పంటలు సమృద్ధిగా ఇండ్లకు వచ్చే కాల సమయం..

## పండుగ

## తెలుగు రాష్ట్రాల్లో భోగి వేడుకలు

**తెలంగాణ బ్యూరో, డైలీ రిపోర్ట్: జనవరి 13**



భోగి అంటే విష్ణువు అనే అర్థమూ ఉంది. శ్రీహరిని భోగినాడు భోగేంద్రనాథుడిగా ఆరాధిస్తారు. లోకానికి ప్రాణశక్తిని అనుగ్రహించే సూర్యుణ్ణి వైభోగిగా కీర్తిస్తారు. భోగిపళ్ల వేడుకతో సూర్యారాధనను ఆరంభించి ,రథ సప్తమి వరకు నియమపూర్తకంగా కొనసాగించే సంప్రదాయం ఉంది.ఉత్తరాయణ పుణ్యకాలానికి భోగి శుభమంగళ తోరణమై వర్ధిల్లుతుంది. హేమంత రుతువులో ప్రకృతికి సౌందర్యత్వాన్ని, భోగత్వాన్ని ఆపాదించేది కాబట్టి ఈ పండుగను భోగిగా పేర్కొంటారని సూర్యతంత్రం వివరించింది. రంగనాథుణ్ని పతిగా పొందాలని గోదాదేవి శ్రీవ్రతాన్ని ఆచరించింది.ఆ సిరినోము పండిన శుభతరుణమే-భోగి. ఆత్మకు గోదాదేవి ప్రతీక. పరమాత్మకు రంగనాథుడు సంకేతం. ఆత్మ పరమాత్ముల సమ్మేళనం మధుర భక్తితో సుసాధ్యమని ఆండాళ్ నిరూపించింది.ద్వాపర యుగంలో నందనందనోత్సవంగా భోగిని నిర్వహించేవారని భాగవతం పేర్కొంది. భోగిపండుగ నాడే శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తి ప్రకృతి వైపరీత్యాల నుంచి గోకులాన్ని రక్షించాడంటారు.అందుకే భోగినాడు గోవర్ధనగిరి పూజ చేస్తారు.భోగి సందర్భంగా గొబ్బి గౌరీ వ్రతాన్ని చేస్తారు. ఇంటి ముంగిట అలంకరించే ముగ్గులో పెద్ద గొబ్బెమ్మను, దాని చుట్టూ చిన్న గొబ్బెమ్మలను పెడతారు. ఇవి కృష్ణుడికీ గోపికలకు ప్రతీకలు.ఈ గొబ్బిళ్లను శ్రీకృష్ణ తత్వానికే కాక, శివలింగ స్వరూపాలకూ సమన్వయం చేస్తారు.గోమయంతో చేసే శివలింగార్చననే-గొబ్బిగౌరీ వ్రతంగా పేర్కొంటారు.భోగిలో ఉన్న అర్థాల్లో సర్పం ఒకటి. కాలాన్ని సర్పంతో పోల్చడం తెలిసిందే. కాలాన్ని సద్వినియోగం చేసుకునే వారికి అంతా లాభం జరుగుతుందని భోగి అంతర్యం.భోగం అంటే ఉత్తమయోగం.అన్ని పరిణామాలను సాదరంగా స్వీకరిస్తూ , సానుకూలంగా మసలుకోవాలని ఈ పండగ చెబుతుంది. గోవిందుడు, గోదాదేవి,గొబ్బెమ్మలు గోమాత అనే నాలుగు అంశాల నేపథ్యంగా ప్రకృతిలో పూర్ణత్వాన్ని దర్శించాలని, అందుకు భోగినాటి సంప్రదాయాలు అందరికీ ఆదర్శమవుతాయి. నేటి భోగి పండుగ...రేపటి సంక్రాంతికి సంకేతం.